## ఉడుంపూర్ ఫారెస్ట్‌లో బర్డ్‌వాక్


పక్షులను గుర్తిస్తున్న అటవీ అధికారులు

కడెం, అక్టోబర్ 4: వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని కడెం మండలంలోని ఉడుంపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బర్డ్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వోలు ప్రకాశ్, చంద్ర మౌళి ఆధ్వర్యంలో కల్పకుంట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కెమెరాల్లో వివిధ రకాల పక్షులను బంధించారు. శుక్రవారం 32 విభిన్న పక్షులను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్వో సురేందర్, ఎఫ్‌బీవో ప్రసాద్, సిబ్బంది, తదితరులున్నారు.

## న్యాయవాదిపై పోలీసుల దాడి అమానుషం

**బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్**


జిల్లా కోర్టు ఎదుట ధర్నా చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఎదులాపురం, అక్టోబర్ 4 : హైడ్రా బాధితులకు అండగా నిలిచిన న్యాయవాది కలీంపై పోలీసులు దాడి చేయడం అమానుషమని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్ అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. న్యాయవాదులపై దాడులను అరికట్టాలని, న్యాయవాద పరిరక్షణ చట్టం తేవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్, న్యాయవాదులు రహీం, చందు సింగ్, అమరేందర్ రెడ్డి, కార్డె రవి, విశ్వనాథ్, సరిత తదితరులు పాల్గొన్నారు.


సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# సోయా కొనుగోళ్లలో ఇబ్బంది కలిగించవద్దు

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బోథ్, అక్టోబర్ 4 : రైతులకు ఇబ్బందులు లేకుండా సోయా కొనుగోలు చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. శుక్రవారం బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘం ద్వారా చేపడుతున్న సోయా కొనుగోళ్లను అదనపు కలెక్టర్ శ్యామలా దేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు నాణ్యమైన సోయాలు తెచ్చి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4890 పొందాలని, దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. దళారులు తెచ్చే సోయా పంటను కొనుగోలు చేయవద్దని, మార్కెట్ యార్డులో అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, డీసీవో కిరణ్ కుమార్, సొసైటీ చైర్మన్ ప్రశాంత్, సురేందర్ యాదవ్, రుక్మన్ సింగ్, లింగారెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎల్క రాజు, రమణా గౌడ్, వినయ్, తాహెర్ బిన్ సలాం, సీఈవో భూషణ్ పాల్గొన్నారు.

### మీ కష్టాలు తీరేవరకు మీ వెంటే ఉంటా..

గుడిహత్నూర్, అక్టోబర్ 4 : బోథ్ నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరేవరకు 'మీ వెంటే ఉంటా..ప్రభుత్వంతో పోరాడి సమస్యలు పరిష్కరిస్తా' అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని చిన్న మల్కాపూర్, మల్కాపూర్, కొత్వాల్‌గూడ గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. 'మా పల్లెల్లో ఇప్పటి వరకూ ఏ ఎమ్మెల్యే పర్యటించలేదు. మీరు వచ్చారు అంతే చాలు' అంటూ ఆదివాసులు హర్షం వ్యక్తం చేశారు.

# బతుకమ్మ చీరలకు మంగళం

- పంపిణీ నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- గతేడాది జిల్లాలో 2,63,247 మంది ఆడబిడ్డలకు పండుగ కానుక అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వం


బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు

ఆదిలాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : పేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా అమలు చేసిన పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు తమ పండుగలను సంతోషంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం సహాయ, సహకారాలు అందించింది. తెలంగాణలో ఆడబిడ్డలు ఎంతో ఘనంగా నిర్వహించే బతుకమ్మ పండుగకు చీరలను పంపిణీ చేసింది. గతేడాది పండుగ వరకు చీరల పంపిణీ కొనసాగగా ఆదిలాబాద్ జిల్లాలో 2,63,247 మంది లబ్ధిదారులకు అందించింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడబిడ్డలకు అందించిన సాయంతో మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా నిర్వహించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పండుగకు చీరలను పంపిణీ చేస్తుందని మహిళలు ఆశించారు. చీరల పంపిణీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మహిళలకు నిరాశ మిగిలింది.

### 2,63,247 చీరల పంపిణీ

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా బతుకమ్మ పండుగకు ముందుగానే ఆడబిడ్డలకు చీరలను పంపిణీ చేసింది. జిల్లాలో అర్హులైన మహిళలను గుర్తించి మున్సిపాలిటీలు, గ్రామాల్లో పంపిణీ చేశారు. మహిళలకు 6 మీటర్ల, 9 మీటర్ల చీరలు కేసీఆర్ సర్కారు ఉచితంగా అందించింది. గతేడాది ఆదిలాబాద్ అర్బన్ మండలంలో 50,365 చీరలు, ఆదిలాబాద్ రూరల్ మండలంలో 16223, మావల మండలంలో 4000 మందికి, తలమడుగులో 13039, తాంసిలో 6530, భీంపూర్‌లో 9272, జైనథ్‌లో 18886, బేలలో 15249, ఇచ్చోడలో 16185, గుడిహత్నూర్‌లో 11833, సిరికొండలో 6148, బజార్‌హత్నూర్‌లో 10379, బోథ్‌లో 17,642, నేరడిగొండలో 10,868, ఇంద్రవెల్లిలో 15,242, ఉట్నూర్‌లో 22,416, నార్నూర్‌లో 11155 మందికి, గాదిగూడలో 7815 మంది ఆడబిడ్డలకు బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చీరల పంపిణీ నిలిపివేయడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఏవీ బతుకమ్మ చీరెలు..



బీఆర్ఎస్ సర్కారు హయాంలో సీఎంగా కేసీఆర్ సారు ప్రతి ఏడాదీ ఈ సమయానికల్లా బతుకమ్మ చీరెలను పంపేవారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు పుట్టింటి చీరగా భావించి అపురూపంగా చూసేవారు. కాంగ్రెస్ సర్కారు వచ్చినంక ఎక్కడా బతుకమ్మల కళ కనిపించడం లేదు. బతుకమ్మ చీరల జాడ లేదు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు బతుకమ్మలకు ఎంతటి వైభవం ఉండేది. రేవంత్‌రెడ్డి సర్కారు బతుకమ్మ చీరల పంపిణీ పద్ధతి పాటించాలి.

*-కరుణ, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి, దస్నాపూర్, ఆదిలాబాద్*

### బతుకమ్మ చీరలు ఇచ్చే స్థితిలో సర్కారు లేదు



ఆడబిడ్డల పండుగను గౌరవిస్తూ ప్రతి ఏటా బతుకమ్మ చీరలను కేసీఆర్ సార్ పంపేవారు. వాటిని గ్రామాలు పట్టణాల్లో లక్షలాది మంది మహిళలు అపురూపంగా తీసుకునేవారు. ఇపుడా ఊసే లేదు. కాంగ్రెస్ సర్కారు పెద్దలు బతుకమ్మలను మరిచిపోయినట్లున్నారు. ఈ సర్కారు చీరె లిచ్చే పరిస్థితిలో లేదని అంతా అంటున్నారు. ఏ గ్రామంలో చూసినా బతుకమ్మ చీరెల చర్చ వినిపిస్తున్నది. కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా ఆడబిడ్డలందరికీ బతుకమ్మ చీరెలను అందజేయాలి.

*- స్వరూపారాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు, ఆదిలాబాద్*


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

# ఏజెన్సీ కోటా ప్రకటించిన తర్వాతే నియామకాలు చేపట్టాలి

ఎదులాపురం, అక్టోబర్ 4: డీఎస్సీ–2024లో ఏజెన్సీ కోటా ప్రకటించిన తర్వాతే నియామకాలు చేపట్టాలని, కోర్టు తీర్పును కూడా లెక్క చేయకుండా నియామకాలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమేశ్ అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏజెన్సీలో 5వ షెడ్యూల్, పెసా, 1 ఆఫ్ 70 చట్టాలున్నా గిరిజనేతరులకు పోస్టింగులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఏజెన్సీలో నియామకాలను నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమేశ్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లి పర్యటనలో ఆదిలాబాద్‌కు దత్తత తీసుకుంటామని చెప్పారన్నారని గుర్తుచేశారు. కానీ ఏజెన్సీ ప్రాంతంలోని యువత ఉద్యోగాలు లేక రోడ్లపై తిరుతున్నారన్నారు. ఐటీడీఏలో బ్యాక్ లాక్ పోస్టులున్నా భర్తీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని పది నెలలుగా ఎదురు చూస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పునకు అనుగుణంగా ఏజెన్సీ కోటాను ప్రకటించిన తర్వాతే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ మెస్రం రవి, తిరుపతి, కోనేరావ్, మెస్రం సురేశ్, లావణ్య తదితరులున్నారు.

# సోయా కొనుగోళ్లపై సీలింగ్

- ఎకరాకు 6 క్వింటాళ్లు మాత్రమే సేకరణ
- అన్నదాతలు నష్టపోతారంటున్న రైతు సంఘాలు
- జిల్లాలో ప్రారంభమైన కొనుగోళ్లు


సోయా పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్, అక్టోబర్ 4 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది సోయాబిన్ పంట దిగుబడి ఆశా జనకంగా ఉన్నా కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో శుక్రవారం సోయా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో స్థానిక ఎమ్మెల్యే పాయల్‌శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానాకాలంలో 71,226 ఎకరాల్లో సోయాబిన్ పంటను సాగు చేశారు. సీజన్‌లో 4,27,356 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసి ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

### 6 క్వింటాళ్ల సీలింగ్‌తో రైతులకు నష్టం..

ఈ ఏడాది రైతులు ఊహించిన విధంగా ఎకరాకు 8 క్వింటాళ్లకుపైగా పంట దిగుబడులు వచ్చాయి. పంట కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఎకరాకు 6 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. అదనంగా దిగుబడి వచ్చిన పంటను విక్రయించేందుకు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి ఉంటుంది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 4892 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ.4300 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ.600 వరకు నష్టపోవాల్సి వస్తున్నది. పంట కొనుగోళ్లలో కోతలు విధించడం, తేమ, పంట నాణ్యత పేరిట ధరలు తగ్గిస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట కొనుగోలులో సీలింగ్ ఎత్తివేయాలని రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### ఎకరాకు 12 క్వింటాళ్లు కొనాలి..



*ఈ ఏడాది సోయాబిన్ పంట దిగుబడులు బాగున్నాయి. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభుత్వం జిల్లాలో నాఫెడ్ ద్వారా సోయాబిన్ పంట కొనుగోళ్లను ఏర్పాటు చేసి ఎకరాకు 6 క్వింటాళ్ల చొప్పున మాత్రమే సేకరిస్తామని అంటున్నారు. పంట కొనుగోళ్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం సరికాదు. రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన సోయాను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి. ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు సేకరించాలి. సోయాబిన్‌లో సహజంగా ఎక్కువ తేమ ఉంటుంది. తేమ శాతం నిబంధన సైతం సవరించాలి.*

*- బండి దత్తాద్రి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్*

### రైతులు నష్టపోతారు..



*సోయా కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధన ఫలితంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొన్నది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4892 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ.4300తో కొంటున్నారు. దీంతో క్వింటాల్‌కు రూ.600 వరకు నష్టం జరుగుతున్నది. ప్రైవేట్ వ్యాపారులు పంట కొనుగోళ్లలో కోతలు పెడుతారు. డబ్బులు అప్పటికప్పుడు ఇస్తే రూ.100కు రూ.2 కోత విధిస్తారు. ప్రైవేట్ వ్యాపారులకు పంటను విక్రయిస్తే రైతులు పలు విధాలుగా నష్టపోతారు. ప్రభుత్వమే రైతుల పంటను మొత్తం కొనాలి.*

*- బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు*


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్

# మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ సర్కారు

- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించారు
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్

ఎదులాపురం, అక్టోబర్ 4 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ సర్కారు ధిక్కరించిందని, సీఎం రేవంత్ రెడ్డి మాదిగల ద్రోహిగా మిగిలారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ ఆరోపించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌భవన్‌లో ఎమ్మార్పీఎస్ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారాన్ని కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆగస్టు 1న తీర్పు ఇచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి అసెంబ్లీలో తీర్పును స్వాగతిస్తూ ఇప్పటికే ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి ఆర్డినెన్స్ తీసుకొస్తామని, దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలుపుతామని ప్రకటించారని గుర్తుచేశారు. కానీ డీఎస్సీ ఫలితాలు విడుదల చేస్తూ గ్రూప్ 1, 2 స్టాఫ్ నర్స్ ఇలా అనేక నోటిఫికేషన్లు, విద్యారంగంలో పలు అడ్మిషన్ల నియామక ప్రక్రియను వేగవంతం చేస్తూ మాదిగ ఉపకులాల ప్రజలకు దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలు రాకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సర్కారు తీరుకు నిరసనగా ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నల్ల జెండాలతో నిరసన ర్యాలీ తీయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు కంబ్లె బాలాజీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బారుకుంట సుభాష్, ఇండ్ల ఎల్లన్న, ఆరెపల్లి గణేశ్, సందురి వినయ్‌సాగర్ జిల్లా నాయకులు దాసరి రాంప్రసాద్, రాజేశ్వర్, అల్ల కొండ రవి, సంజీవ్, ప్రణయ్, పోశెట్టి విలాస్, తదితరులు పాల్గొన్నారు.



ఇసుకతో పాటు రవాణాకు ఉపయోగించే ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేస్తున్న అధికారులు

# పెన్‌గంగ నదిలో తనిఖీలు

- నమస్తే కథనానికి స్పందించిన రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు
- అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, పడవలు, జేసీబీ సీజ్


పడవను సీజ్ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్, అక్టోబర్ 4 ( నమస్తే తెలంగాణ) : బేల మండలం కాంగార్‌పూర్ పెన్‌గంగా నది నుంచి ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం 'నిండుగా నీళ్లు పడవలతో ఇసుక వెలికితీత' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు నది పరిసరాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. నది పక్కన చెట్లలో ఉంచిన ఆయిల్ ఇంజిన్లతో కూడిన 3 పడవలు, 3 జేసీబీలు, 2 టిప్పర్లు, 2 ట్రాక్టర్లతో పాటు నిల్వచేసిన 12 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బేల తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ రఘునాథ్‌రావు మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను ఎవరైనా తీసుకుపోతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కాంగార్‌పూర్ నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో మైనింగ్ ఏడీ రవీందర్, మైనింగ్ టీఏ రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ వామన్‌రావు, ఆర్ఐ అశోక్, పోలీసులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించే దాకా పోరాడుతాం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 4 : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే దాకా పోరాడుతామని పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపకుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పీఆర్టీయూ (తెలంగాణ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధిస్తామని ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లు, ఎంఈవో, డైట్ లెక్చరర్లకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. 317 జీవోతో నష్టపోయిన వారిని తిరిగి స్థానికత ఇప్పించి 13 జిల్లాల స్పౌస్ పోస్టింగ్‌లు ఇప్పిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను దసరా నాటికి ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ ఇప్పించి కేజీబీవీ వారికి రెండవ శనివారం, ఆప్షనల్ హాలిడే వచ్చేలా చూస్తామన్నారు. గురుకులాల్లోని పార్ట్ టైమర్లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇప్పిస్తామన్నారు. అధ్యక్షుడు ఉమాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, ఆయా జిల్లాల నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి


సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


సర్వేను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**సర్వేను పరిశీలించిన ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు**

ఎదులాపురం, అక్టోబర్ 4 : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ పైలట్ ప్రాజెక్టు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం పట్టణంలోని వార్డు నంబర్ 11, 12లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారాన్ని సేకరించడంతో సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని, తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, మావల తహసీల్దార్లు శ్రీనివాస్, వేణు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వార్డు కౌన్సిలర్ షానవాజ్, తదితరులున్నారు.

### పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలి

ఇచ్చోడ, అక్టోబర్ 4 : అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం మండలంలోని ఆడెగాం(బీ) అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రిజిష్టర్లు, రికార్డులు, వంట గది, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. చిన్నారులకు చదవడం, రాయడం నేర్పాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ సీఈవో కలిందిని, ఎంపీడీవో లక్ష్మణ్, కార్యదర్శులు పురుషోత్తం, హిమబిందు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

### పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 4 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకో సం పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మల్ పట్టణం 42 వ వార్డు(చింతకుంట)లో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించా రు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల ఆధారం గా సర్వే చేస్తున్నామని కొత్త కుటుంబాల వివరాలను ఆధార్ కార్డు ద్వారా నమోదు చేస్తున్నట్లు సర్వే బృందం కలెక్టర్‌కు వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాలు, వార్డుల్లో సర్వేలో తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.